సాక్షి
ప్రకాశం

శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



శాంతించిన వరుణుడు

వరుణుడు శాంతించి వర్షం తగ్గినప్పటికీ.. మూడు రోజులు కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి.

- 8లో..



ఇటు స్కూళ్ల సముదాయం.. అటు మద్యం దుకాణం

మద్యం షాపులు దక్కించుకున్న తెలుగు తమ్ముళ్లు నిబంధనలు ఉల్లంఘించి స్కూళ్ల సముదాయం వద్దే వైన్ షాప్ ఏర్పాటు చేశారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
31/26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆదర్శప్రాయుడు.. వాల్మీకి

- ఘనంగా జయంతి వేడుకలు



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఒంగోలు అర్బన్: ఆటవిక జీవితం నుంచి మహర్షిగా ఎదిగిన వాల్మీకి ప్రతిఒక్కరికీ ఆదర్శ ప్రాయుడని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా స్థానిక ప్రకాశం భవనంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి మంత్రి పాల్గొన్నారు. తొలుత వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బీసీలకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మనిషి ప్రవర్తన ఏ విధంగా ఉండాలో వాల్మీకి జీవితం తెలియజేస్తుందన్నారు. ఆ విలువలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగుపరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, టూరిజం చైర్మన్ బాలాజీ, మేయర్ సుజాత, బీసీ సంక్షేమ అధికారి అంజల, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, దివ్యాంగుల సంక్షేమ అధికారి అర్చన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మౌలానా జయంతి సందర్భంగా పురస్కారాలు

ఒంగోలు వన్‌టౌన్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి (నవంబర్ 11) సందర్భంగా మైనార్టీల సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి బి.నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉర్దూ భాషాభివృద్ధి, సాహిత్యం, విభిన్న రంగాలలో అత్యుత్తమ సేవలందించిన వారికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ స్థాయి పురస్కారం కింద రూ.1,25,000 ప్రోత్సాహకం, సర్టిఫికెట్, జ్ఞాపిక, డాక్టర్ అబ్దుల్ హఖ్ ప్రాంతీయ స్థాయి పురస్కారం కింద రూ.లక్ష, సర్టిఫికెట్, జ్ఞాపిక అందించనున్నట్లు తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొత్తమద్యం పాలసీ అందుబాటులోకి వచ్చేసింది. లాటరీలో దుకాణాలు దక్కించుకున్న వారిలో చాలా మంది బుధవారం అమ్మకాలు ప్రారంభించేశారు. రూ.99కే మద్యం కొనుగోలు చేసేందుకు దుకాణాల వద్దకు వెళ్లిన మందుబాబులకు నిరాశే ఎదురైంది. ఎమ్మార్పీపై అదనంగా 20 నుంచి 30 శాతం ఎక్కువగా విక్రయిస్తుండటంతో విస్తుపోతున్నారు. అధికార పార్టీ నేతల గుప్పెట్లో మొత్తం దుకాణాలు చేరిపోవడంతో ఎమ్మార్పీకి చెల్లుచీటీ పలికేశారు. అధికారులు సైతం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

కిక్.. బ్యాండ్



రూ.99కి మద్యం ఉత్తిదే..

- మద్యం భాటిల్‌పై అదనంగా రూ.30 వసూలు
- తొలిరోజు నుంచే ఎమ్మార్పీ విక్రయాలకు చెల్లుచీటీ
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు
- కొండపిలో దుకాణాలన్నీ ఇవ్వాలంటూ టీడీపీ నేతల ఒత్తిళ్లు
- మిగిలిన దుకాణాల్లో 20 నుంచి 30 శాతం కమీషన్ కోసం బెదిరింపులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలను తమ గుప్పిట్లోకి తీసుకునేందుకు అధికార పార్టీ నాయకులు తీవ్రంగా తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వాటిలో 95 శాతానికిపైగా దుకాణాలను టీడీపీ నాయకులు దక్కించుకున్నారు. అయినప్పటికీ సంతృప్తి చెందడం లేదు. మొత్తం దుకాణాలను చేజిక్కించుకునేందుకు చివరి వరకు ప్రయత్నిస్తున్నారు. దరఖాస్తుల సమయంలో సిండికేట్‌గా ఏర్పడిన తమ్ముళ్లు ఆ తరువాత లాటరీలో దుకాణాలను దక్కించుకున్న తరువాత కూడా అదే సిండికేట్‌ను కొనసాగిస్తున్నారు. అందరూ కలిసి మాట్లాడుకుని ధరలు పెంచి విక్రయిస్తున్నారు. ఇతర అవకతవకలకు పాల్పడుతున్నట్లు కూడా సమాచారం. అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నప్పటికీ ఎక్సైజ్ శాఖాధికారులు మాత్రం తమకు ఏమీ తెలియదన్నట్లు నటిస్తున్నారు. కొందరు ఎక్సైజ్ సీఐలు మాత్రం ఇదంతా మామూలే అని చెబుతుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందు రూ.99కే నాణ్యమైన మందు సరఫరా చేస్తానంటూ ఆర్భాటం చేసిన చంద్రబాబు హామీ మాటలకే పరిమితమైందని మందుబాబులు గగ్గోలు పెడుతున్నారు. ఎమ్మార్పీ ప్రకారం మద్యం విక్రయించాలని డిమాండ్ చేస్తున్నారు.

సిండికేట్ ట్యాక్స్ రూ.30...

జిల్లాలోని మద్యం దుకాణాలన్నీ బుధవారమే ప్రారంభమయ్యాయి. ఒకటీఅరా మినహా వ్యాపారాలు కూడా మొదలుపెట్టేశారు. అయితే, జిల్లాలోని దుకాణాలన్నీ అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో 20 మద్యం దుకాణాలున్నాయి. ఇక్కడ కూడా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. రూరల్ గ్రామాల్లో అయితే నిలబెట్టి మరీ రూ.50 అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ అండదండలున్న కొందరు వ్యాపారులు మాత్రం నిబంధనలకు వ్యతిరేకంగా బార్లకు సరుకు తరలించి జేబులు నింపుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. పశ్చిమ ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం, మార్కాపురం, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు, కనిగిరి, కంభం, గిద్దలూరు మద్యం దుకాణాలలో 20 నుంచి 30 రూపాయలకు పెంచి విక్రయిస్తున్నారు. మార్కాపురంలో సిండికేట్ కొనసాగిస్తున్న వ్యాపారులు క్వార్టర్ బాటిల్‌పై రూ.30 వరకు పెంచి విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇదేంటని ఎవరైనా ప్రశ్నిస్తే.. లక్షలు పెట్టి లైసెన్సు తెచ్చుకున్నాం, ఎమ్మెల్యేలకు, ఎక్సైజ్ అధికారులకు ఇవ్వాల్సింది ఇవ్వకపోతే మా దుకాణాలు నడిచే పరిస్థితి లేదు, ఇక ఎమ్మార్పీకి విక్రయిస్తే మాకు వచ్చేది చిప్పేనంటూ గొణుక్కుంటున్నారని మందు బాబులు చెబుతున్నారు.

గుడ్‌విల్ పేరుతో సెటిల్‌మెంట్..

కనిగిరి నియోజకవర్గంలో కనిగిరి ఎక్సైజ్ పరిధిలోని కనిగిరి పట్టణంతో పాటు 5 మండలాలకు 19 షాపులు ఉన్నాయి. అందులో ఎక్కువ షాపులు తెలుగు తమ్ముళ్లకే దక్కాయి. కనిగిరి రూరల్ ఏరియాకు కేటాయించిన 3 షాపులు ఒకేచోట ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు లైసెన్సు తీసుకుని షాపుల ఏర్పాటుకు సిద్ధమయ్యారు. అడ్డరోడ్డులోని ఒక షాపును పాత సిండికేట్ (టీడీపీ) నేతలు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు గుడ్‌విల్ ఇచ్చి కొనుగోలు చేసినట్లు తెలిసింది. మిగతా రెండు షాపులు కొత్త టీడీపీ నేతలైనప్పటికీ ఒకరు రూరల్ మండల నాయకుడు కాగా, మరొకరు పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు పోటీపడుతున్నారు. దీంతో అక్కడ ఇక షాపుల మధ్య హోరాహోరీ పోటీ జరిగే అవకాశం ఉంది.

చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు...

జిల్లాలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు నోరు విప్పడం లేదు. ఎక్కడా ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం విక్రయించడమే కాకుండా బడులు, గుడులను పట్టించుకోకుండా ఎక్కడ పడితే అక్కడ మద్యం దుకాణాలను తెరుస్తున్నప్పటికీ సినిమా చూస్తున్నట్లు చూస్తున్నారేగానీ అభ్యంతరం చెప్పడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

షాపులన్నీ మాకివ్వాల్సిందే...

కొండపి నియోజకవర్గంలో 20 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాలన్నీ తెలుగు తమ్ముళ్ల చేతిలోకి వచ్చాయి. ఒకటీఅరా దుకాణాలు ఇతరులకు వచ్చినా వారిని బెదిరించి మరీ దుకాణాలను తమ్ముళ్లు సొంతం చేసుకుంటున్నట్లు సమాచారం. ప్రధానంగా సింగరాయకొండలోని 6 మద్యం దుకాణాలలో 2 దుకాణాల వరకు తమ్ముళ్లకు వచ్చాయి. మిగతా దుకాణాలను కూడా తమకే ఇచ్చి పక్కకు తప్పుకోవాలని దామచర్ల సత్య హుకుం జారీ చేసినట్లు చెప్పుకుంటున్నారు. రూ.30 లక్షల గుడ్‌విల్ ఇస్తాం, దుకాణం మాకు ఇచ్చేసిపోండని చెబుతున్నారని ప్రచారం జరుగుతోంది. టీడీపీకి చెందిన ఒక నాయకుడికి వచ్చిన దుకాణాన్ని కూడా ఇచ్చేయమంటూ ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. అలాగే నియోజకవర్గంలోని పొన్నలూరు, జరుగుమల్లి, మర్రిపూడి, టంగుటూరు, కొండపి మండలాలలో 20 నుంచి 30 శాతం వరకు కప్పం వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

అధికారులే ఆద్యులా..?

- మూడేళ్లుగా ఒకసారి కూడా ఎలైట్ మాల్స్‌ను తనిఖీ చేయని ఎక్సైజ్ అధికారులు
- ప్రతి 15 రోజులకు ఒకసారి తనిఖీ చేయాల్సి ఉండగా నిర్లక్ష్యం
- ఎక్సైజ్ కానిస్టేబుల్ చేతివాటానికి అదే కారణం
- రూ.2.34 కోట్లకుపైగా స్వాహా
- పరారీలో ఎక్సైజ్ కానిస్టేబుల్ రమణచౌదరి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మాల్స్ సిబ్బంది కుటుంబ సభ్యులు

ఒంగోలు టౌన్: ఎక్సైజ్ అధికారుల బాధ్యతా రాహిత్యం, నిర్లక్ష్యం కారణంగానే ఆ శాఖలో పనిచేస్తున్న కానిస్టేబుల్ మార్నేని రమణచౌదరి భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఒంగోలు నగరంలోని ఎలైట్ మాల్స్‌లో చేతివాటం చూపి రూ.2.34 కోట్లకుపైగా స్వాహా చేసిన రమణచౌదరి పరారయ్యాడు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి 15 రోజులకు ఒకసారి ఎక్సైజ్ అధికారులు ఎలైట్ మాల్స్‌ను, వైన్ షాపులను తనిఖీ చేయాల్సి ఉంది. కానీ, మూడేళ్లుగా ఒక్కసారి కూడా తనిఖీలు చేయలేదు. దాన్నే ఆసరాగా చేసుకుని సదరు కానిస్టేబుల్ చెలరేగిపోయాడు. అతని చేతివాటానికి ఆ శాఖ అధికారులే ఆద్యం పోశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒంగోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రమణచౌదరి ప్రభుత్వ మద్యం దుకాణాలకు వెరిఫికేషన్ ఆఫీసర్ (వీవో)గా వ్యవహరించాడు. నగరంలోని మంగమ్మ కాలేజీ సమీపంలో, సుజాతనగర్ సమీపంలో ఉన్న రెండు ఎలైట్ మాల్స్‌తో పాటు మరో 15 మద్యం దుకాణాలకు ఇతడు వీవోగా వ్యవహరించాడు. ఆ అవకాశాన్ని అడ్డం పెట్టుకుని భారీ మొత్తంలో నగదు కాజేశాడు. ఆ విషయం బయటపడేసరికి అధికారుల కళ్లుగప్పి మాయమయ్యాడు. మాల్స్ సిబ్బంది ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు చేసేంత వరకూ ఈ విషయం ఎవరికీ తెలియలేదంటే ఎక్సైజ్ అధికారులు ఏ స్థాయిలో మొద్దు నిద్ర పోతున్నారో అర్థం చేసుకోవచ్చు.

మూడేళ్లుగా తనిఖీ చేయని అధికారులు...

మొన్నటి వరకూ ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ప్రతి మద్యం దుకాణానికి ఒక సూపర్‌వైజర్, ఇద్దరు సేల్స్‌మెన్లను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. ఏ రోజు మద్యం ఆదాయాన్ని ఆ రోజే లెక్కకట్టి మరుసటి రోజు బ్యాంకులో జమ చేయాల్సి ఉంది. ఎలాంటి అక్రమాలు, అవకతవకలు జరగకుండా ఉండేందుకు ఎక్సైజ్ అధికారులతో మూడంచెల పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశారు అయితే ఎక్సైజ్ కానిస్టేబుల్ రమణచౌదరి ఆ శాఖలో పనిచేస్తున్న పైఅధికారులను ప్రభావితం చేశాడో ఏమోగానీ.. గత మూడేళ్లుగా ఒక్కసారైనా ఎస్సైలు, సీఐలు ఒంగోలులోని ఎలైట్ మాల్స్‌ను తనిఖీ చేయలేదని తెలుస్తోంది. దీంతో అంతా తానై రమణచౌదరి కథ నడిపించాడు. మాల్స్‌లో బాటిళ్లను స్కాన్ చేసిన తర్వాత మాత్రమే విక్రయాలు జరపాల్సి ఉంటుంది. కానీ, ఎవరికీ అనుమానం రాకుండా కొంత సరుకును మాత్రమే స్కాన్ చేసి విక్రయాలు జరిపించాడు. ఆ ఆదాయాన్ని మాత్రమే బ్యాంకులో జమ చేయించాడు. మిగిలిన సరుకును స్కాన్ చేయకుండా బయట రెస్టారెంట్లకు అమ్ముకున్నాడు. ఆ నగదును పూర్తిగా స్వాహా చేశాడు. ఇలా గత మూడేళ్లలో మంగమ్మ కాలేజీ వద్ద గల మాల్ నుంచి రూ.1,53,10,600, సుజాతనగర్ సమీపంలోని మాల్ నుంచి రూ.81,23,170 కలిపి మొత్తం 2,34,33,770 రూపాయలను రమణచౌదరి కాజేశాడు.

కేసు నమోదు చేయకుండానే పోలీస్‌స్టేషన్‌లో రాజీ యత్నాలు...

మద్యం మాల్స్‌లో జరిగిన అవినీతి బాగోతంపై ఇంత వరకు అధికారులు కేసు నమోదు చేయలేదు. ఉన్నతాధికారులు విచారిస్తున్నారని, తదుపరి కేసు నమోదు చేస్తామని చెబుతున్నారు. ఎవర్నీ వదిలిపెట్టేది లేదని ఎక్సైజ్ ఎస్ఈ షేక్ ఖాజామోహిద్దీన్ అంటున్నారు. నిజానికి రమణచౌదరి అవినీతి గురించి ఎవరైతే ఫిర్యాదు చేశారో వారిని బుధవారం ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. కానీ, ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని ఎక్సైజ్ సీఐ లీన తెలిపారు. ఈలోపే రమణచౌదరికి అనుకూలంగా పోలీస్‌స్టేషన్‌లోనే రాజీ యత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. అందుకే ఇప్పటికీ కేసు నమోదు చేయలేదన్న ప్రచారం జరుగుతోంది.

మాల్స్ సిబ్బంది కుటుంబ సభ్యుల ధర్నా...

లిక్కర్ మాల్స్‌లో అక్రమాలకు పాల్పడిన రమణ చౌదరి, అతడికి సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాల్స్‌లో పనిచేసిన సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్ల కుటుంబ సభ్యులు గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. మాల్స్‌లో పనిచేసిన సిబ్బంది ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసలు దోషులను శిక్షించి బాధితులైన తమవారికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. రమణ బెదిరింపులకు భయపడటం వలనే సిబ్బంది ఇంతకాలం ఎవరికీ ఫిర్యాదు చేయలేదని తెలిపారు. నేరం చేసిన రమణను రక్షించి తమవారిని ఇరికించే ప్రయత్నాలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



తమ ఇల్లు కూల్చివేశారంటూ రోదిస్తున్న కొప్పల బాల ఈశ్వరమ్మ

ఇళ్లను నేలమట్టం చేస్తున్న జేసీబీ

బడాబాబుల కోసం.. పేదల నీడ కూల్చేసి

ఒకవైపు హైకోర్టులో కేసు నడుస్తున్నా.. మరోవైపు బడాబాబుల కోసం పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేశారు. తెల్లవారుతున్న వేళ జేసీబీలతో వచ్చి ఇళ్లను నేలమట్టం చేసి నిలువ నీడ లేకుండా చేశారు. ఆక్రమణల పేరుతో మూడు దశాబ్దాలకుపైగా నివాసం ఉంటున్న వారిని ఉన్నపళంగా రోడ్డున పడేశారు. ఇంట్లో సామగ్రి, పిల్లాజెల్లాతో వీధినపడిన బాధితుల రోదనలు పట్టించుకునే వారే కరువయ్యారు. శుక్రవారం హైకోర్టులో వాయిదా ఉండగా, పోలీసులతో వచ్చి భయభ్రాంతులకు గురిచేసి ఇళ్లను కూల్చివేశారంటూ అధికారులపై బాధితులు మండిపడుతున్నారు.

- నేడు హైకోర్టులో వాయిదా ఉండగా..
- 10 గృహాలను కూల్చివేసిన ఏపీఐఐసీ అధికారులు
- ఆక్రమణల పేరుతో ఇళ్లు కూల్చివేత
- పేర్నమిట్ట పారిశ్రామికవాడలో విరుచుకుపడిన జేసీబీలు
- పిల్లాపాపలతో రోడ్డున పడిన 15 కుటుంబాలు
- నిలువ నీడ లేకుండా చేశారని విలపిస్తున్న బాధితులు

ఒంగోలు టౌన్: ఒంగోలు–కర్నూలు రాష్ట్రీయ రహదారి.. పక్కనే పేర్నమిట్ట పారిశ్రామికవాడ ప్రాంతం.. గురువారం తెల్లవారుతున్న సమయం.. ఇళ్లలో చిన్నపిల్లలు ఇంకా నిద్ర లేవలేదు.. సామగ్రి మొత్తం అలాగే ఉంది.. ఒక్కసారిగా అలజడి.. పోలీసులు, జేసీబీలతో హడావిడి.. 35 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లను నేలమట్టం చేశారు.. ఆక్రమణల తొలగింపు పేరుతో ఏపీఐఐసీ అధికారులు పేదల ఇళ్లను కూల్చివేశారు. పూర్తి వివరాల్లోకెళ్తే.. ఒంగోలులోని పేర్నమిట్ట పారిశ్రామికవాడలో ఒంగోలు–కర్నూలు రోడ్డు పక్కనే పేదలు ఇళ్లు నిర్మించుకుని సుమారు 35 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారు. దాదాపు 10 ఇళ్లలో 15 కుటుంబాలు జీవిస్తున్నాయి. వీరి నివాసాలకు వెనుకనే మాజీ మంత్రి శిద్దా రాఘవరావుకు చెందిన స్థలం ఉంది. గతేడాది ఆ స్థలాన్ని ఒంగోలుకు చెందిన సిమెంటు వ్యాపారి కొనుగోలు చేసినట్లు సమాచారం. అప్పటి నుంచి అక్కడ నివసిస్తున్న పేదలకు కష్టాలు మొదలయ్యాయి. వారి నివాసాలను ఖాళీ చేయించి ఆ స్థలంలో షాపింగ్ మాల్ నిర్మించేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలోనే నివాసాలను ఖాళీ చేయించేందుకు కొద్దికాలంగా ప్రయత్నిస్తున్నారని వినికిడి. ఇక్కడ మేము షాపింగ్ మాల్ నిర్మిస్తున్నాం.. పార్కింగ్‌కు స్థలం కావాలి.. మీరు ఇళ్లు ఖాళీ చేయండంటూ వారిపై ఒత్తిడి చేస్తూ వస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. తాము మూడు దశాబ్దాలుగా నివసిస్తున్నామని, ఇళ్లు ఖాళీ చేయలేమని నిరుపేదలు తేల్చి చెప్పారు. దాంతో రౌడీలతో బెదిరించడం, రాత్రిపూట ఇళ్లపై రాళ్లు వేయించడం లాంటి ఘటనలు కూడా జరిగాయి. అంగబలం, అర్థబలంతో పేదలను భయపెట్టాలని చూశారు. అయినప్పటికీ పేదలు ఇళ్లు ఖాళీ చేయలేదు. ప్రాణాలు పోయినా పర్వాలేదు, ఇళ్లు మాత్రం ఖాళీ చేసేది లేదని తేల్చి చెప్పడంతో.. సదరు పారిశ్రామికవేత్త ఇక లాభం లేదనుకున్నారు. ఏపీఐఐసీ ద్వారా కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో బాధితులు ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్‌ను కలిసి తమ గోడు వినిపించుకున్నారు. అయినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయకుమార్‌ను కూడా కలసి సమస్య చెప్పుకున్నారు. ఆ తర్వాత కూడా ఈ నెల మొదటి వారంలో పోలీసులు వచ్చి ఇళ్లు ఖాళీ చేయాలంటూ పేదలను హడావిడి చేశారు. బాధితులంతా న్యాయం కోరుతూ కోర్టుకు వెళ్లారు. రేపు హైకోర్టులో వాయిదా ఉండగానే.. గురువారం ఉదయం పోలీసులను రంగంలోకి దించి ఇళ్లు కూల్చివేయడంతో బాధితులు బోరున విలపిస్తున్నారు. ఒంగోలు తాలూకా సీఐ అజయ్‌కుమార్, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లతో భారీ బందోబస్తు మధ్య మొత్తం 10 నివాసాలను జేసీబీలతో అడ్డగోలుగా కూల్చివేశారు. బాధితులకు సామగ్రి సర్దుకునే సమయం కూడా ఇవ్వలేదు. ఇళ్లలో ఉన్న వంట సామగ్రి, ఇతర వస్తువులు ఎక్కడివక్కడే ఉన్నాయి. పిల్లల పుస్తకాలు కూడా తీసుకోనివ్వకపోవడంతో బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. కాగా, కోర్టు ఉత్తర్వుల ప్రకారమే రోడ్డు పక్కన ఆక్రమణలను కూల్చివేసినట్లు ఏపీఐఐసీ జెడ్‌ఎం మదన్‌మోహన్ చెబుతున్నారు.



ఇంటిని కూల్చడంతో సామగ్రితో చెట్టు కిందకి చేరిన కుటుంబం

మమ్మల్ని రోడ్డున పడేశారు



గతేడాది రోడ్డు ప్రమాదంలో నా భర్త చనిపోయారు. ఇద్దరు పిల్లలతో ఇక్కడే మా తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాను. ఇప్పుడు ఉన్నపళంగా మా ఇల్లు కూల్చివేశారు. మమ్మల్ని రోడ్డున పడేశారు. మాకు ముందూ.. వెనుక ఎవరూ లేరు. మేమెక్కడికి వెళ్లాలి.. ఎలా బతకాలి..? ఈ ప్రభుత్వం మాకు తీరని అన్యాయం చేసింది.

– సుభాషిణి, బాధితురాలు

నెత్తిమీద నీడ లేకుండా చేశారు



నా భర్తకు కరెంటు షాకు కొట్టి చేతులు పనిచేయడం లేదు. కుమారుడు లారీ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అతనికి ముగ్గురు పిల్లలున్నారు. కుటుంబం మొత్తం కుమారుడి మీదే ఆధారపడి జీవిస్తోంది. అసలే పేదరికంతో అల్లాడుతున్న మాకు.. ఇప్పుడు నెత్తి మీద నీడ లేకుండా చేశారు. కనీసం మాకు ఏదైనా దారి చూపిస్తామని కూడా చెప్పడం లేదు. అధికారులు, ఎమ్మెల్యేలకు మా మీద దయ కలగలేదు. మా ఇళ్లు కూలుస్తుంటే ఒక్క ఎమ్మెల్యే కూడా వచ్చి పలకరించిన పాపాన పోలేదు. దయచేసి మాకు న్యాయం చేయండి.

– అమ్మనబ్రోలు రత్తమ్మ, బాధితురాలు

అన్నీ అక్కడే ఉన్నాయి

మూడు తరాలుగా మేము ఇక్కడే జీవిస్తున్నాం. మా తాతల కాలంలో ఇక్కడకు వచ్చాం. మా పెళ్లిళ్లు ఇక్కడే అయ్యాయి. మాకు పిల్లలు ఇక్కడే పుట్టారు. వారి పెళ్లిళ్లు కూడా ఇక్కడే చేశాం. మా ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, కరెంటు బిల్లులు, ఇంటి పన్నులు అన్నీ ఈ చిరునామాతోనే ఉన్నాయి. ఇప్పుడు మా జీవితాలనే కాదు.. మా సాక్ష్యాలను కూడా కూల్చివేశారు. అసలే నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఎవరి పంచలోనైనా తలదాచుకునే అవకాశం కూడా లేదు. ఇంత దయలేకుండా మా బతుకులను రోడ్డు పాలు చేశారు.

– కొప్పుల బాలఈశ్వరమ్మ, బాధితురాలు



అధికారులు కూల్చివేసిన పేదల ఇళ్లు



ఎక్కడికి వెళ్లాలో తెలియక రోడ్డు పక్కన ఉన్న కుటుంబం

తప్పిన వరద ముప్పు

- వాయుగుండం తీరం దాటడంతో ఆగిన వర్షం
- జిల్లాలో సరాసరిన 30.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ఒంగోలు అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీరం దాటడంతో వర్షం ఆగిపోయి వరద ముప్పు తప్పింది. జిల్లా ప్రజానీకం, అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. సోమవారం నుంచి మూడు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షాలు కొనసాగితే వరద ముప్పు ఉండేది. కానీ, గురువారం ఉదయం వాయుగుండం తీరందాటే సమయంలో మాత్రమే వర్షాలు కురిసి మధ్యాహ్నం నుంచి ఎండకాసింది. జిల్లాలో అక్కడక్కడా కొద్దిపాటి వర్షపాతం మాత్రమే నమోదైంది. జిల్లాలో సరాసరిన 30.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఒంగోలులో ఉదయం 8.30 గంటలకు 50.8 మిల్లీమీటర్లు నమోదవగా, ఆ తర్వాత వర్షం లేదు. టంగుటూరు మండలంలో 67.7 మిల్లీమీటర్లు, కొత్తపట్నం 32.1, నాగులుప్పలపాడు 29.2, చీమకుర్తి 35.6, మద్దిపాడు 71.6, సంతనూతలపాడు 46.2, కొండపి 68.6, జరుగుమల్లి 80.8, సింగరాయకొండ 34.8, తాళ్లూరు 56.6, ముండ్లమూరు 17.6, కనిగిరి 8.8, హెచ్‌ఎం పాడు 15, వెలిగండ్ల 11.4, పామూరు 16.8, సీఎస్ పురం 38.8, పీసీ పల్లి 12.6, పొన్నలూరు 39.2, మర్రిపూడి 40.4, పొదిలి 19.8, కొనకనమిట్ల 20.4, దర్శి 17, దొనకొండ 14.2, కురిచేడు 20.8, మార్కాపురం 25.2, తర్లుపాడు 30.8, దోర్నాల 36.3, పెద్దారవీడు 14.6, యర్రగొండపాలెం 22.2, త్రిపురాంతకం 20.2, పుల్లలచెరువు 25.6, గిద్దలూరు 30.6, రాచర్ల 23, కొమరోలు 21.4, బేస్తవారిపేట 33.4, కంభం 12, అర్ధవీడు 12 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


రోడ్డు ప్రమాదంలో మరణించిన జోసఫ్ మృతదేహం

ఒంగోలు టౌన్: మండలంలోని కరవది సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం..ఉలిచి గ్రామానికి చెందిన మంచు జోసఫ్ (38) వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై కరవది వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో ఎర్రమట్టిరేవు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడు సర్పంచ్ మురళికి బంధువు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైకులు ఢీ

- ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు

మార్కాపురం: రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మార్కాపురం పట్టణంలోని ఎస్‌వీకేపీ కళాశాల ఎదురుగా బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పట్టణానికి చెందిన కూరపాటి రాజశేఖర్ అలియాస్ సామ్యేలు(37) కళాశాల రోడ్డులోని ఒక ఫంక్షన్ హాల్లో వివాహానికి హాజరై, తన బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో మార్కాపురం పట్టణంలోని 10వ వార్డుకు చెందిన అశోక్ తన టూవీలర్‌పై వెళ్తూ రాజశేఖర్ వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో రాజశేఖర్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. అశోక్‌కు కూడా తీవ్ర గాయాలు కావడంతో స్థానిక జీజీహెచ్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అశోక్‌ను గుంటూరుకు తరలించారు. పట్టణ ఎస్సై సైదుబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు రాజశేఖర్‌కు భార్య ఎలిజబెత్ రాణి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రాజశేఖర్ వెల్డింగ్ వర్కర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.


జమ్ములపాలెంలో నీట మునిగిన రామాలయం


అనుమలవీడులో ఉధృతంగా ప్రవహిస్తున్న నక్కల వాగు


జి.కొత్తపల్లి వద్ద కోతకు గురైన తారురోడ్డు

శాంతించిన వరుణుడు

- బుధవారం రాత్రి, గురువారం ఉదయం పలు ప్రాంతాల్లో భారీ వర్షం
- ఇంకా వరద ముంపులోనే లోతట్టు ప్రాంతాలు
- పాకల గ్రామంలో జాలమ్మతల్లి ఆలయంపై పిడుగు
- టంగుటూరు అరుంధతీ నగర్‌లో కూలిన భవనం
- రాచర్ల మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు
- మాచవరం– ఉప్పుగుండూరు మధ్య కోతకు గురైన రోడ్డు
- చదలవాడ వద్ద హైవేపై వాహనాల దారి మళ్లింపు

టంగుటూరు/నాగులుప్పలపాడు/రాచర్ల: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో బుధవారం రాత్రి, గురువారం ఉదయం జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వాగులూ వంకలు పొంగిపొర్లడంతో పలుచోట్ల వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం మధ్యాహ్నానికి వరుణుడు శాంతించినా లోతట్టు ప్రాంతాలు, పొలాలు ఇంకా వరద ముంపులోనే ఉన్నాయి. జిల్లాలో అత్యధికంగా జరుగుమల్లి మండలంలో 80.8 మి.మీ, టంగుటూరు మండలంలో 66.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

☛ టంగుటూరు మండలం జమ్ములపాలెంలోని శ్రీరామచంద్ర స్వామి ఆలయ గర్భగుడితో సహా నీట మునిగింది. టంగుటూరు అరుంధతీ నగర్‌లో పట్టా కోటేశ్వరరావు నివాసం కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది, ఎంపీటీసీ కొమ్ము ప్రభుదాసు బాధితులను పరామర్శించి అధికారులకు సమాచారం ఇచ్చారు. సింగరాయకొండ మండలం పాకల గ్రామంలో జాలమ్మతల్లి ఆలయ గోపురంపై పిడుగు పడటంతో దేవత విగ్రహం స్వల్పంగా ధ్వంసమైంది.



☛ రాచర్ల మండలంలో భారీ వర్షం కారణంగా అనుమలవీడు సమీపంలోని నక్కలవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గుడిమెట్ట–అంకిరెడ్డిపల్లె మార్గంలో గుడిమెట్ట పెద్ద చెరువుకు వచ్చే కతువ కాలువ ఉధృతంగా ప్రవహించడంతో రోడ్డు కోతకు గురైంది. దీంతో గుడిమెట్ట, జి.కొత్తపల్లి మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పత్తి, మినుము, కంది, పొగాకు పంటల్లో నీరు నిల్వ ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాకపోకలు బంద్

నాగులుప్పలపాడు మండలంలో చదలవాడ చెరువు కట్టకు గండి పడి నీరంతా 216 జాతీయ రహదారిపై ప్రవహిస్తుండటంతో బారికేడ్లు అడ్డుగా పెట్టి వాహనాలను దారి మళ్లించారు. మాచవరం–ఉప్పుగుండూరు గ్రామాల మధ్య రోడ్డు నీటి ప్రవాహానికి కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచాయి. ఈ మార్గంలో రెవెన్యూ సిబ్బందిని కాపలా ఉంచారు.


చదలవాడ చెరువు గండి సమీపంలో హైవేకి అడ్డుగా బారికేడ్లు


టంగుటూరు అరుంధతీ నగర్‌లో కూలిన ఇల్లు


నాగులుప్పలపాడు : వరద ముంపులోనే పొలాలు

ఇటు స్కూళ్ల సముదాయం.. అటు మద్యం దుకాణం

- వైపాలెంలో నిత్యం రద్దీగా ఉండే ప్రదేశంలో లిక్కర్ షాప్
- ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్న పచ్చ తమ్ముళ్లు
- జనం ఆందోళనను పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు


లిక్కర్ షాప్ సమీపంలో ఉన్న ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల(ఈ క్యాంపస్ లోనే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి)


కొలుకుల రోడ్డులో లిక్కర్ షాప్ ఏర్పాటుకు సన్నాహాలు

యర్రగొండపాలెం: తెలుగు తమ్ముళ్లకు 'కిక్కు' నశాలానికి అంటినట్లుంది. అధికార మదం, ప్రశ్నించేవారు లేరన్న ధైర్యంతో యర్రగొండపాలెంలో పాఠశాలల సమీపంలో, నిత్యం రద్దీగా ఉండే ప్రదేశంలో మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక కొలుకుల రోడ్డులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంతో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు ఉన్నాయి. ఈ రోడ్డులో గిరిజన గూడేలకు చెందిన వారితోపాటు వివిధ గ్రామాలకు చెందిన వారు యర్రగొండపాలేనికి రాకపోకలు సాగిస్తుంటారు. కిరాణా దుకాణాలు, ప్రైవేటు వైద్యశాలలు, హోటళ్లు ఉండటంతో కొలుకుల రోడ్డు ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు జనంతో కిక్కిరిసి ఉంటుంది. జాతీయ రహదారికి సమీపంలో ఉండే ఈ రోడ్డులో మద్యం వ్యాపారం బాగా సాగుతుందన్న ఉద్దేశంతో లిక్కర్ షాప్ ఏర్పాటుకు తెలుగు తమ్ముళ్లు ఎత్తుగడ వేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బడి, గుడి, జాతీయ రహదారికి 100 మీటర్ల దూరంలో మద్యం షాపులు నిర్వహించుకోవాలి. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలి. అయితే అవేవీ తమకు పట్టవన్నట్లు పాఠశాలల సముదాయానికి 90 మీటర్లలోపే దుకాణం తెరిచారు. ఈ బరితెగింపును కట్టడి చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడం యర్రగొండపాలెంలో తీవ్ర చర్చనీయాంశమైంది. మందుబాబుల దెబ్బకు ఇకపై రాకపోకలు సాగించడం, పిల్లలను పాఠశాలలకు పంపడం కష్టమని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎక్సైజ్ అధికారులు స్పందించి మద్యం దుకాణాన్ని మరో ప్రాంతంలో ఏర్పాటు చేయించాలని వారు కోరుతున్నారు.

గ్రానైట్ అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి

- ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి


చీమకుర్తి రోడ్డును పరిశీలిస్తున్న రంగసాయిరెడ్డి

ఒంగోలు సిటీ: గ్రానైట్ అక్రమ రవాణాపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి డిమాండ్ చేశారు. గ్రానైట్ అక్రమ రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి మైనింగ్‌మాఫియా ద్వారా వందల కోట్లు గండి పడుతుందన్నారు. చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్‌ను 45 గ్రానైట్ క్వారీల ద్వారా అధికారికంగా రోజుకి 300 వాహనాల ద్వారా 3200 క్యూబిక్ మీటర్ల గెలాక్సీ గ్రానైట్ రాయి తరలింపు చేస్తున్నారన్నారు. అనధికారికంగా మరో 3000 క్యూబిక్ మీటర్ల గ్రానైట్ రాయి అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. మైనింగ్ మాఫియాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎలాంటి అనుమతులు లేకుండా అత్యంత ఖరీదైన చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్‌ను కొండలు పిండి చేసి క్వారింగ్ చేస్తున్న మైనింగ్ మాఫియా వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్న వాహనాలను మొక్కుబడిగా పోలీస్‌స్టేషన్‌కు తరలించి వదిలేస్తున్నారన్నారు. ఈ అక్రమ రవాణాకు కారణమైన గ్రానైట్ క్వారీ అక్రమార్జకులపై కనీస చర్యలు తీసుకోకపోవడంతో చూస్తుంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందన్నారు. చీమకుర్తి దగ్గర రోడ్డు పరిస్థితి చూస్తుంటే ఇటు మనుషుల ప్రాణాలకు అటు వాహనాల పటిష్టతకు పెనుప్రమాదం ఏర్పడిందన్నారు. మైనింగ్ మాఫియాకు సహకరిస్తున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కారు బోల్తాపడి నలుగురికి గాయాలు


బోల్తాపడిన కారు

దర్శి: మండలంలోని బొట్లపాలెం గ్రామ శివారులో కారు బోల్తా పడి నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. తూర్పు గంగవరం గ్రామం వైపు నుంచి దర్శి వైపు వస్తున్న కారు బొట్లపాలెం గ్రామ శివారులో బోల్తా పడింది. ప్రమాదంలో నలుగురు వ్యక్తులు గాయపడినట్లు తెలిసింది. అయితే ఎవరికి ప్రాణహానీ సంభవించలేదు.

మద్యం మత్తులో.. భార్య గొంతు కోసిన భర్త

- ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి


తిరుపతమ్మ మృతదేహం

సింగరాయకొండ(కొండపి): కుటుంబ కలహాలతో మద్యం మత్తులో భార్య గొంతు కోయడంతో ఆమె మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని ఊళ్లపాలెంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..పుట్టా వెంకట్రావు, తిరుపతమ్మకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. వెంకట్రావు సింగరాయకొండలోని కూరగాయల దుకాణంలో పనిచేస్తుండగా, తిరుపతమ్మ ఉప్పుకొఠారులో కూలి పనులకు వెలుతుంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల తరుచూ భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం మద్యం సేవించి ఇంటికి వచ్చిన వెంకట్రావును తిరుపతమ్మకు మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో తిరుపతమ్మ కర్రతో వెంకట్రావును కొట్టడంతో ఆగ్రహించిన వెంకట్రావును కత్తితో ఆమె గొంతు కోశాడు. దీంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న తిరుపతమ్మను 108లో కందుకూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ ధ్రువపత్రాల వ్యవహారం.. తహసీల్దార్ సహా ఆరుగురిపై కేసు

పొదిలి: స్థానిక విశ్వనాథపురంలోని ఓ సొసైటీ స్థలానికి సంబంధించి నకిలీ ధ్రువీకరణ పత్రాలను తయారు చేసిన విషయమై అప్పటి తహసీల్దార్, సర్వేయర్, వీఆర్‌ఓలతో సహా ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వేమన తెలిపారు. కేసు పూర్వాపరాలను ఆయన వివరించారు. పొదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులో సర్వే నంబర్ 2012, 2013లో 145 చదరపు గజాల స్థలాన్ని వి.ఏడుకొండలు, టి.వెంకటరావు వద్ద వెలిశెట్టి వెంకటేశ్వర్లు కొనుగోలు చేశారు. వారిద్దరూ హక్కుదార్లుగా వెంకటేశ్వర్లుకు రిజిస్ట్రేషన్ చేయించారు. అదే స్థలాన్ని బెల్లం పద్మజ అనే మహిళ 2022లో వి.రాజ్యలక్ష్మి, డి.వరలక్ష్మికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. రెవెన్యూ కార్యాలయంలో తప్పుడు పత్రాలు సృష్టించి వీరి పేరున రిజిస్ట్రేషన్ చేయించినట్లు వెలిశెట్టి వెంకటేశ్వర్లు కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు అప్పటి తహసీల్దార్ దేవప్రసాద్, సర్వేయర్ బ్రహ్మం, వీఆర్‌ఓ యాకోబు, మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

డీఎల్‌డీఓ ఉషారాణిపై విచారణ చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా పంచాయతీ విభాగం బదిలీల్లో అవినీతికి పాల్పడిన డీఎల్‌డీఓ ఉషారాణిపై విచారణ చేయాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ డిమాండ్ చేసారు. స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఇటీవల కాలంలో జరిగిన పంచాయతీ కార్యదర్శులు, గుమస్తాలు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌ల బదిలీ వ్యవహారంలో బదిలీ స్థానం ఆధారంగా డీఎల్‌డీఓ నగదు వసూలు చేశారన్నారు. అయితే ఈ వ్యవహారంలో అధికారులు కింద స్థాయి ఉద్యోగులను బలిపశువులను చేసారన్నారు. ఉన్నతాధికారుల విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

- విద్యుత్ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

దర్శి: దేవిరెడ్డి రవికృష్ణారెడ్డితో విద్యుత్ శాఖలో పనిచేసే జేఏఓ ఎస్ వేణుగోపాల్‌తో జరిగిన ఆర్థిక లావాదేవీలు పూర్తిగా వారి వ్యక్తిగతమని, వాటికి విద్యుత్ శాఖకు ఎటువంటి సంబంధం లేదని విద్యుత్ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక ఈఆర్‌ఓ కార్యాలయానికి వేసిన తాళాలను గురువారం ఆయన తీయించి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవిరెడ్డి రవికృష్ణారెడ్డి, అతని భార్య ప్రసన్నలు వారి ఇంటిని విద్యుత్ రెవెన్యూ కార్యాలయానికి, విద్యుత్ సబ్‌డివిజన్‌కు అద్దెకు ఇచ్చారని తెలిపారు. ఆ ఆంటికి అద్దె ఖరారు అనుమతి కోసం తమ శాఖ కార్పొరేట్ కార్యాలయానికి ఫైలు పంపించామన్నారు. అయితే దేవిరెడ్డి రవికృష్ణారెడ్డి ఎస్ వేణుగోపాల్ అనే జేఏఓతో జరిగినవని చెబుతున్న ఆర్థిక లావాదేవీలన్నీ ప్రైవేట్‌గా జరిగినవని తెలిపారు. దీనిపై ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌తో విచారణ చేయించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. విచారణ అనంతరం శాఖ నిబంధనల మేరకుచర్యలు ఉంటాయన్నారు. ప్రైవేట్ ఫైనాన్సియల్ లావాదేవీలపై సదరు జేఏఓ వేణుగోపాల్‌తో చట్టప్రకారం సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవచ్చన్నారు. విద్యుత్ కార్యాలయానికి, అధికారుల విధులకు ఆటంకం కలిగించవద్దని, కార్యాలయంలో విద్యుత్ బిల్లులు వసూలు వంటి వాటికి ఇబ్బందులు కలిగించవద్దని కోరారు. రవికృష్ణారెడ్డి, అతని భార్య ప్రసన్న కలిసి కార్యాలయానికి సిబ్బందిని రానీయకుండా ఇబ్బందులకు గురిచేసినందుకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసులు, విజిలెన్స్ సీఐ బీటీ నాయక్‌లు విద్యుత్ కార్యాలయాన్ని సందర్శించారు. భవనానికి అద్దె బకాయిలు త్వరితగతిన వచ్చేలా చూస్తామని పేర్కొన్నారు.


గండి పూడ్చకపోవడంతో చెరువు నుంచి భారీగా బయటకు వస్తున్న నీరు


గండిని పూడ్చేందుకు తీసుకువచ్చిన ఇసుక బస్తాలు

పూడ్చకపోతే ఎలాగండి?

ప్రజల ప్రాణాలంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారో ఈ సంఘటనే నిదర్శనం. భారీ వర్షాలకు మండలంలోని చదలవాడ రామన్న చెరువుకు గండి పడింది. గ్రామంలోని ఎస్టీ కాలనీలోకి నీరు చేరింది. దీంతో అధికారులు ఆ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు పరుగు పరుగున గ్రామానికి చేరుకొని గండిని పరిశీలించారు. గ్రామానికి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో అత్యవసరంగా గండిని పూడ్చాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ముప్పు నేపథ్యంలో బుధవారం రాత్రి కూడా మరోమారు చెరువు నీటి తీవ్రతను పరిశీలించారు. అయితే అధికారులు కలెక్టర్ ఆదేశాలను లెక్క చేయలేదు. ఓ వైపు చెరువులో నుంచి నీరు జాతీయ రహదారిపై నుంచి వెళుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. గురువారం కూడా అధికారులు జాతీయ రహదారిపై నీరు పారకుండా ఎటువంటి చర్యకోలేదు. కలెక్టర్ ఆదేశాలను లెక్క చేయకుండా అధికారుల వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. – నాగులుప్పలపాడు


చదలవాల చెరువు నుంచి జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న నీరు